క్లుప్తంగా

నేడు ఉప ముఖ్యమంత్రి పర్యటన

వెదురుకుప్పం: ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి గురువారం మండలంలోని నల్లవెంగనపల్లె గ్రామ సచివాలయ పరిధిలో పర్యటించనున్నట్లు ఎంపీడీఓ సుధాకరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంత్రి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధితో పాటు వారి సమస్యలను అడిగి తెలుసుకుంటారని చెప్పారు. మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది హాజరుకావాలని కోరారు.

లీజుకు ఆర్టీసీ స్థలాలు

పుత్తూరు రూరల్: పుత్తూరు, కోట, వెంకటగిరి, సూళ్లూరుపేట, గూడూరులో ఆర్టీసీ స్థలాలు అద్దెకు లీజుకు ఇవ్వడం జరుగుతుందని డిపో మేనేజర్ ప్రశాంతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిపై గురువారం తిరుపతి ఆర్ఎం కార్యాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పుత్తూరు బస్టాండ్ ఆవరణలోని 3,823 చదరపు గజాలు కలిగిన స్థలం, 4,017 చ.గ., 5,179 చ.గ., కలిగిన 3 బిట్లు 15 ఏళ్లకు, లేక 33 ఏళ్లకు అద్దెకు లీజు ఇవ్వనున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఇంటింటికి మంత్రి రోజా బహుమతి



గేట్‌పుత్తూరులో ముస్లింలకు బహుమతి అందజేస్తున్న నాయకులు

పుత్తూరు రూరల్: రంజాన్ పండుగను పురస్కరించుకుని పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా ముస్లింలకు బహుమతులను అందజేసింది. గత సోమవారం నగరిలోని తన ఇంటి వద్ద ఇఫ్తార్ విందు ఇచ్చిన మంత్రి, అక్కడికి రాని వారికి ఇంటికి బహుమతిని పంపించారు. ఈ మేరకు బహుమతులను బుధవారం పుత్తూరు పట్టణంలోని ప్రతి ముస్లీం ఇంటికి పంపించారు. కార్యక్రమంలో మైనారిటీ ఫైనాన్స్ డైరెక్టర్ మాహీన్, మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యసిబ్బందికి అవగాహన

పుత్తూరు రూరల్: అగ్ని మాపక సిబ్బంది ఇస్తున్న సూచనలు పాటిస్తూ అగ్ని ప్రమాదాలను నివారించాలని పుత్తూరు ఫైర్ ఆఫీసర్ నేతాజీ కోరారు. బుధవారం అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ వైద్య విధాన పరిషత్ ఆస్పత్రిలో సిబ్బందికి, ప్రజలకు అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని, వీటిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తతతో మెలగాలని చెప్పారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తూ, ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది ఉమాపతి, గిరిధర్, జోతీశ్వరరెడ్డి, చంద్రశేఖరయ్య,, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నగరిలో..

నగరి: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్నిమాపక సిబ్బంది ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులకు అగ్నిమాపక పరికరాల పనితీరు, వాటిని వినియోగించాల్సిన పద్ధతులపై మాక్‌డ్రిల్ ద్వారా అవగాహన కల్పించారు. అగ్నిమాపక విన్యాసాలు ప్రదర్శించడంతో పాటు కరపత్రాలు పంచారు.


పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారం తింటున్న గర్భిణులు

పుత్తూరు రూరల్: స్థానిక వైద్యవిధాన పరిషత్ ఆస్పత్రిలో బుధవారం పరీక్షల నిమిత్తం వచ్చిన గర్భిణులకు ‘రోజా చారిటబుల్ ట్రస్ట్’ ద్వారా ఉచితంగా పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఆస్పత్రిలో వేచి ఉండే సమయంలో గర్భిణులు భోజనానికి ఇబ్బందులు పడకూడదని పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమాన్ని నిరంతరాయంగా అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం చికిత్స నిమిత్తం ఆస్పత్రికి వచ్చిన గర్భిణులకు, వారి సహాయకులకు యథావిధిగా వెజిటబుల్ పలావు, వైట్ రైస్, గుడ్డు, కరీస్, పచ్చడి, సాంబారు, రసం, పెరుగు అన్నం, చిక్కి, అరటిపండును అందించారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యాధికారి శంకర్‌నరేన్, హాస్పిటల్ డెవలప్‌మెంట్ మెంబర్స్ నారాయణస్వామి, పుష్ప, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వార్షికోత్సవం



ఆకర్షణగా నిలిచిన దీపాలంకరణ

నగరి: మండలంలోని నంబాకం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో హాజరై అందరినీ ఆకట్టుకున్నారు. పాఠశాలలో ఓం ఆకారంలో ఏర్పాటుచేసిన దీపపు కాంతుల ఆకర్షణగా నిలిచింది. పీపీఎస్ చైర్మన్ తిరుమలరెడ్డి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేక్ కట్ చేసి విద్యార్థులకు పంచారు.

జగనన్న తోడుగా ఉందాం

- సంక్షేమ పథకాలతో ప్రజల్లో జగనన్న స్థానం పదిలం
- చంద్రబాబు పాలనంతా అబద్ధాలు, మోసాలమయం..
- ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి



మహిళలతో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి



నమాజ్ చేస్తున్న ఉప ముఖ్యమంత్రి

వెదురుకుప్పం: అభాగ్యులకు అండగా అన్ని వర్గాల ప్రజలకు తోడుగా ఉంటూ సీఎం జగనన్న ఆదుకుంటున్నారని ఉప ముఖ్యమంత్రి కే.నారాయణస్వామి అన్నారు. బుధవారం మండలంలోని నల్లవెంగనపల్లె పంచాయతీ గుంతలచేను, చింతలగుంట, చింతలగుంట దళితవాడ, అల్లంవారికండ్రిగ, కలిమిచేను, నల్లవెంగనపల్లె, మిట్టూరు, ఏపేరి గ్రామాల్లో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటి వద్దకు వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిపై ఆరా తీసి, ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా వృద్ధి చెందాలన్న ఆకాంక్షతో సీఎం జగనన్న వైఎస్సార్ ఆసరా ద్వారా దశల వారీగా రుణమాఫీ చేస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ పాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని, అందులో భాగంగానే గ్రామీణ ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించాలన్న ఉద్దేశంతో సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చినట్లు తెలిపారు. సంక్షేమ పథకాలతో ప్రజల్లో జగనన్న స్థానం పదిలంగా నిలచినట్లు స్పష్టం చేశారు.

కుట్రలు, కుతంత్రాలతోనే బాబు పాలన..

అధికారంలో ఉన్నన్ని రోజులు కూడా చంద్రబాబు కుట్రలు, కుతంత్రాలు, అబద్ధాలు, మోసాలతో పాలన సాగించాడని డిప్యూటీ సీఎం నారాయణ స్వామి విమర్శించారు. గతంలో నమ్మి ఓట్లు వేసిన వారిని ముంచేసి తన వర్గానికి దోచి పెట్టిన వ్యక్తి చంద్రబాబు అని విమర్శించారు. కులమతాలకు అతీతంగా రాజకీయాలను పక్కన పెట్టి ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు అందించాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అభిమతమన్నారు. ప్రజలనే నమ్ముకుని ప్రజలే బలమని భావిస్తున్న సీఎం జగనన్నను అందరూ ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు.

సీఎం జగన్ అన్నీ ఇస్తున్నాడు...

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమకు అన్నీ ఇస్తున్నాడని నల్లవెంగనపల్లె గ్రామానికి చెందిన రామచంద్రనాయుడు తెలిపాడు. పింఛను, రైతు భరోసా, తన చిన్న కొడుక్కి ఇల్లు కూడా మంజూరు చేశారని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామితో ఆనందాన్ని పంచుకున్నాడు. ఈ సందర్భంగా నల్లవెంగనపల్లె గ్రామస్తులు మంత్రిని దుశ్శాలువతో ఘనంగా సత్కరించి స్వాగతించారు. ఎండను సైతం లెక్క చేయకుండా మంత్రి ప్రజలతో మమేకమవుతూ పర్యటన కొనసాగించారు.

ఆదుకోవాలి..

పేదలను అన్ని విధాలా ఆదుకోవాలని అధికారుల ను డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఆదేశించారు. ప్రభుత్వ భూములను సాగు చేసుకుంటున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని తహసీల్దార్ పుల్లారెడ్డిని సూచించారు. అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ ఇంటి స్థలంతో పాటు ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో సిమెంటు రోడ్లు, మురికినీటి కాలువ నిర్మాణాలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగరాణి, జెడ్పీటీసీ సుకుమార్, పీఆర్ డీఈ దయాకర్‌రెడ్డి, ఎంపీడీఓ సుధాకరరావు, విద్యుత్ ఏఈ రామాంజనేయులు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బండి గోవర్ధన్‌రెడ్డి, సీనియర్ నాయకుడు పేట ధనుంజయరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్‌రెడ్డి, గృహసారథుల కన్వీనర్ బట్టే సుబ్రమణ్యం, సర్పంచ్‌లు పుష్ప, గోవిందయ్య, ఎంపీటీసీలు చిన్నబ్బ, మునిచంద్రారెడ్డి, భాస్కర్, కో–ఆప్షన్ సభ్యుడు వెంకటేష్, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు శివాజీ, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు రామయ్య, స్థానిక నాయకులు గణపతిరెడ్డి, నరేంద్ర, కృష్ణారెడ్డి, బొజ్జారెడ్డి, మాజీ ఎంపీటీసీలు రోశిరెడ్డి, హేమచంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ గోవిందన్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో ఉప ముఖ్యమంత్రి

మండలంలోని వేపేరి గ్రామంలోని మసీదులో బుధవారం సాయంత్రం ముస్లింలు ఇచ్చిన ఇఫ్తార్ విందులో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లింలు మంత్రిని సాదరంగా స్వాగతించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం రంజాన్ పవిత్రత గురించి తెలియజేశారు.

మైనారిటీల అభ్యున్నతే ధ్యేయం



ఇఫ్తార్ విందులో పాల్గొన్న జ్ఞానేంద్రరెడ్డి

చిత్తూరు అగ్రికల్చర్ (పెనుమూరు): మైనారిటీల అభ్యున్నతే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని విదేశీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారు మహాసముద్రం జ్ఞానేంద్రరెడ్డి అన్నారు. బుధవారం ఆయన, ఎంపీపీ హేమలత రెడ్డి పెనుమూరులోని నూరాని మసీదులో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ పవిత్రమాసంలో ముస్లింలు ఎంతో నిష్ఠతో చేపట్టే దీక్షలకు అల్లా మంచి చేయాలని ఆయన ఆకాంక్షించారు. పలువురు ముస్లింలు మాట్లాడుతూ నారమాకుల బైలులోని ఈద్గాకు ప్రహరీ గోడ నిర్మించాలని కోరారు. దీంతో ఎంపీపీ హేమలత రెడ్డి మండలగ్రాంట్ నుంచి రూ.5 లక్షలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దొరస్వామి యాదవ్, ఎంపీటీసీ సుభాషిణి, సింగిల్‌విండో అధ్యక్షుడు కారేటి గోవిందరెడ్డి, నాయకులు మహాసముద్రం సురేష్‌రెడ్డి, కంచెర్ల చక్రవర్తినాయుడు, దూది శంకర్, రూది వెంకటేష్, ఈశ్వర్‌రెడ్డి, కొర్ర సుధాకర్, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

2200 మందికి రంజాన్ తోఫా



రంజాన్ తోఫాను పంపిణీ చేస్తున్న పూర్ణచంద్రారెడ్డి

గంగాధరనెల్లూరు: పేదలకు ఇతోధికంగా సేవలందిస్తున్న ఆర్టీసీ వైస్ చైర్మన్ ఎంసీ విజయానందరెడ్డి ఆదర్శప్రాయుడని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పూర్ణచంద్రారెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో బుధవారం రంజాన్ సందర్భంగా మండలంలోని 2200 మంది ముస్లిం కుటుంబాలకు విజయానందరెడ్డి ఉచితంగా అందించారన్నారు. కార్యక్రమంలో గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ గుణశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ హరిబాబు, స్థానిక సర్పంచ్ సుబ్రమణ్యంయాదవ్ సర్పంచుల సంఘం అధ్యక్షులు ఏకాంబరం, నాయకులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోండి

పుత్తూరు రూరల్: వేసవి సెలవుల్లో తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల తగు జాగ్రత్తలు వహించాలని సీఐ లక్ష్మీనారాయణ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. వేసవి నుంచి ఉపశమనం పొందడానికి లేదా ఈత నేర్చుకోవాలన్న ఉత్సాహంతో చెరువులు, బావుల వద్దకు వెళ్లి పిల్లలు, యువకులు సైతం ప్రాణాలను పోగొట్టుకుంటున్నారని తెలిపారు. ఈ విషయంలో తల్లిదండ్రులు తమ పిల్లలకు తగిన జాగ్రత్తలు పాటించే విధంగా అవగాహన కల్పించాలని కోరారు. లేకుంటే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

దేశాన్ని కాపాడుకుందాం

నగరి: ప్రధాని మోదీ నుంచి దేశాన్ని కాపాడాలని సీపీఐ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య అన్నారు. బుధవారం నగరి మున్సిపాలిటీ బేరివీధి, కోళ్ల వీధిలో పార్టీ శ్రేణులతో కలిసి ప్రచారభేరి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సంక్షేమాన్ని పక్కనపెట్టి సంక్షేమ బోర్డుని తుంగలో తొక్కుతున్నారని చెప్పారు. సీపీఐ పార్టీ నాయకులు బాషా, రూపుకుమార్, రాజేంద్రన్, బుజ్జి పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల పరిశీలన

నగరి: నాడు–నేడు పథకం కింద చేపడుతున్న పనులు త్వరగా పూర్తి చేయాలని ఎంఈఓ పీఎస్ శ్రీదేవి హెచ్ఎంలకు సూచించారు. బుధవారం వెలుగు కార్యాలయంలో నాడు నేడు పథకం చేపడుతున్న ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు సంబంధిత హెచ్ఎంలతో సమీక్షించారు. డీఈ, ఏఈలు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

పండ్లతోటల పెంపకంపై సమీక్ష

పాలసముద్రం: ఉపాధిహామీ పథకంలో భాగంగా పండ్లతోటల పెంపకంపై సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఏపీడీ సుబ్రమణ్యం తెలిపారు. బుధవారం ఉపాధిహామీ సిబ్బందికి ఏపీఓ బాల, జేఈ అనుషా సమీక్షంలో ఉపాధిహామీ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఏపీడీ సుబ్రమణ్యం మాట్లాడుతూ మండల పరిధిలో జాబ్‌కార్డు కలిగిన ప్రతి కుటుంబాలకు 100 రోజులు పనులు కల్పించామన్నారు.

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి



నరసింహపురం అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసన్

పాలసముద్రం: అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు పౌష్టికాహారం అందించాలని ఎంపీడీఓ శ్రీనివాసన్ తెలిపారు. మండలంలోని నరసింహపురం కేంద్రాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. పిల్లలు, గర్భిణులకు అంగన్‌వాడీ కేంద్రంలోనే భోజనం చేయాలని కార్యకర్తలకు తెలియజేశారు. పిల్లలకు ఉడికిన కోడిగుడ్డు విధిగా ఇవ్వాలన్నారు. అనంతరం నరసింహపురం గ్రామ సచివాలయాన్ని పరిశీలించారు. రికార్డులు, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. స్పందనలో వచ్చిన అర్జీలను అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. జగనన్న లేఅవుట్‌లను పరిశీలించి గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని లబ్ధిదారులకు సూచించారు. లబ్ధిదారులు గృహ ప్రవేశాలకు శుభ ముహూర్తం త్వరలోనే ఉందని తెలిపారు. కార్యక్రమంలో మండల విస్తరణాధికారి రమేష్, శంకర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాక్షేత్రంలో జగనన్న సైన్యం







నగరి: సత్రవాడ, మండలంలో ‘మా నమ్మకం నువ్వే జగన్’ కార్యక్రమంలో చైర్మన్ నీలమేఘం, ఎంపీపీ భార్గవి, వేమాపురంలో..

నగరి: ‘జగనన్నే మా భవిష్యత్.. మా నమ్మకం నువ్వే జగన్’ కార్యక్రమంలో భాగంగా ప్రజాప్రతినిధులు, గృహసారథులు గ్రామాల్లో, పట్టణాల్లో ప్రతి ఇంటికి పర్యటిస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించి లబ్ధిదారుల అభిప్రాయాన్ని అడిగి తెలుసుకుంటున్నారు. పీపుల్స్ సర్వేలో భాగంగా ఐదు ప్రశ్నలు అడిగి, వారు చెప్పిన సమాధానాలను ‘ప్రజామద్దతు పుస్తకం’లో నమోదు చేస్తున్నారు. జగన్ సర్కారుకు మద్దతు తెలిపేందుకు అంగీకరించిన వారితో 82960 82960కు మిస్డ్ కాల్ ఇవ్వాలని కోరుతున్నారు. ఇంటి యజమాని అనుమతితో గోడపై, సెల్‌ఫోన్లపై స్టిక్కర్లను అతికిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోంది. బుధవారం అడవికొత్తూరు గ్రామంలో నిర్వహించిన ‘జగనన్నే మా భవిష్యత్.. మా నమ్మకం నువ్వే జగన్’ కార్యక్రమంలో ఎంపీపీ భార్గవి పాల్గొన్నారు. గృహసారథులతో పాటు ప్రతి గడపకు వెళ్లి సమాచారం సేకరించారు. తడుకుపేట పంచాయతీలో వైస్ ఎంపీపీ కన్నియప్ప సమాచారం సేకరించారు. అలాగే మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం సత్రవాడలో గృహసారథులతో కలిసి ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, జిల్లా నేత అనుబంధ సంఘం అధ్యక్షుడు కన్నాయిరం, మున్సిపల్ పార్టీ అధ్యక్షులు బీఆర్వీ అయ్యప్పన్, అయ్యప్ప, జగన్ తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు రూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలనకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా సోదరుడు, వైఎస్సార్‌సీపీ నేత వై.కుమారస్వామిరెడ్డి తెలిపారు. బుధవారం కుమారస్వామిరెడ్డి ఆధ్వర్యంలో మున్సిపాలిటీ 3వ వార్డులో ‘జగనన్నే మా భవిష్యత్’ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హరి, వైస్ చైర్మన్లు శంకర్, జయప్రకాష్, కౌన్సిలర్లు రాజేశ్వరి, ఏకాంబరం, చిట్టిబాబు, ఆలయాల చైర్మన్లు లారీమోహన్, మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

వడమాలపేటలో..

వడమాలపేట: పేద ప్రజల సంక్షేమం కోసం సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేదల పక్షపాతిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిలుస్తున్నారని వైస్ ఎంపీపీ లోకేష్‌రెడ్డి అన్నారు. బాలినాయుడు కండ్రిగ, పూడి సచివాలయంలో పరిధిలోని వేమాపురం, వడమాలపేట, పాదిరేడు గ్రామాల్లో వలంటీర్లు, గృహసారథులతో కలిసి కార్యక్రమం నిర్వహించారు. పుత్తూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శేఖర్, సోషల్ మీడియా కన్వీనర్ చంద్రారెడ్డి, సచివాలయ కన్వీనర్ రామిరెడ్డి, నాయకులు యాదవేంద్రరెడ్డి, నందయ్య పాల్గొన్నారు.

నింద్రలో ...

నింద్ర: మండలంలో బుధవారం జగనన్నే మా భవిష్యత్– మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని పలు సచివాలయ పరిధిలో నాయకులు ఘనంగా నిర్వహించారు. కొప్పేడు గ్రామ సచివాలయ పరిధిలో నాయకులు ఇంటింటికి తిరుగుతూ సంక్షేమ పథకాలను వివరించారు. ప్రతి గడపకు, మొబైళ్లకు స్టిక్కర్లను అతికించారు. పంచాయతీ పరిధిలోని వేదాంతపురం, దళితవాడలలో నిర్వహించారు. జిల్లా పార్టీ కార్యదర్శి భాస్కర్ రెడ్డి, సర్పంచ్ సంపూర్ణ, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

చంద్రన్న బీమా కార్డులు వద్దు



జగనన్నతోనే మా ప్రయాణం అంటున్న ఎస్టీకాలనీ వాసులు

- జగనన్న సంక్షేమ పథకాలే ముద్దు
- జగనన్న స్టిక్కర్లను చేతపట్టుకుని ఎస్టీ కాలనీ వాసుల నినాదాలు



కుప్పతొట్టెలో పడేసిన చంద్రన్న బీమా కార్డులు

కార్వేటినగరం: ‘బీమా పేరుతో పేదల పొట్ట కొట్టిన చంద్రన్న బీమా కార్డులు వద్దు..సంక్షేమ పథకాలు అందిస్తున్న జగనన్నే ముద్దు’ అని చింతతోపు కాలనీ వాసులు బుధవారం నినాదించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ అధికారంలో ఉన్నంత కాలం చంద్రబాబు ఎస్టీలకు చేసిందేమి లేదని, పసుపు కుంకుమ పేరుతో మహిళలను నిలువునా మోసం చేశాడన్నారు. గత ప్రభుత్వ హయాంలో కాలనీలో ఒకే కుటుంబంలో రెండు మూడు కుటుంబాలు మగ్గుతున్నాయని ఇళ్ల మంజూరు చేయాలని ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. జగనన్న సీఎం కాగానే సంక్షేమ పథకాల ద్వారా చేకూరే లబ్ధిని మా ఖాతాల్లోకి జమ చేసి ఆదుకుంటున్న దేవుడు మా జగనన్న అని కొనియాడరు. చింతతోపు అభివృద్ధికి కృషి చేస్తున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామికి, ఎంపీపీ లత, జిల్లా ప్రధాన కార్యదర్శిబాలాజీకి, సర్పంచ్ ధనంజయవర్మకు కాలనీ వాసులు ఎప్పటికీ రుణపడి ఉంటామన్నారు. అనంతరం టీడీపీ అందించిన చంద్రన్న బీమా కార్డులను మూకుమ్మడిగా రోడ్డుపైన పడేసి, జగనన్నే మా భవిష్యత్ మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను చేతపట్టి నినదించారు. కార్యక్రమంలో కాలనీవాసులు కృష్ణయ్య, రవి, మనోహర్, ఆనందయ్య, లత, రాజేశ్వరి, భాస్కర్, చక్రవర్తి, నాగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, ఏఎంసీ వైస్ చైర్మన్ గోపి, మాజీ కన్వీనర్ ధనుంజయవర్మ, రఫీ, చందురాజు, ధనశేఖర్ వర్మ, దాముదెడ్డి, మణి, పురంధర్, రాజ, ధనశేఖర్ యాదవ్ పాల్గొన్నారు.

ముత్తుస్వామి ఆలయ నిర్మాణానికి స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న కుమారస్వామిరెడ్డి

పుత్తూరు రూరల్: మున్సిపల్ కార్యాలయం సమీపంలో ముత్తుస్వామి ఆలయ నిర్మాణానికి బుధవారం పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా సోదరుడు, వైఎస్సార్‌సీపీ నేత వై.కుమారస్వామిరెడ్డి కమిషనర్ కెఎల్ఎన్‌రెడ్డితో కలిసి స్థల పరిశీలన చేశారు. పట్టణంలోని పురాతన ముత్తుస్వామి ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో పాటు సదరు స్థలం రైల్వే శాఖకు చెందినది కావడంతో మరో స్థలాన్ని ఏర్పాటు చేశారు. సదరు ఆలయంలో కర్మక్రియలు చేసుకోవడం స్థానిక ప్రజలకు ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. ఆలయ నిర్మాణానికి జనరల్ ఫండ్స్ నుంచి నిధులు కేటాయించి త్వరతగతిన పనులు పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లను ఆదేశించారు. అనంతరం 3, 4, 6 వార్డులో పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్డు, డ్రైనేజీ, కల్వర్టు పనులకు వెంటనే టెండర్లు పిలవాలని సూచించారు. మున్సిపల్ చైర్మన్ హరి, వైస్ చైర్మన్లు శంకర్, జయప్రకాష్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కనుల పండువగా కల్యాణం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

పాలసముద్రం: మండలంలోని ఆముదాల గ్రామంలో వెలసిన ధర్మరాజుస్వామి ఆలయంలో మహాభారత ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా ఐదో రోజు బుధవారం ద్రౌపదీ సమేత ధర్మరాజుస్వామికి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

నగరి: మున్సిపల్ పరిధిలోని రాజీవ్‌నగర్ వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో డీఎస్ బాలాజి (34) అనే వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా, వసంతకుమార్ (34), ఎల్ఎల్ ప్రిన్స్ (36) అనే వారికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసుల సమాచారం మేరకు చెన్నై తాంబరం ప్రాంతానికి చెందిన డీఎస్ బాలాజి, మడిబాక్కంకు చెందిన వసంతకుమార్, ఎస్.కళత్తూరుకు చెందిన ఎల్ఎల్ ప్రిన్స్ బీఎండబ్ల్యూ కారులో మంగళవారం కైలాసకోనకు వెళ్లారు. రాత్రి తిరిగి వస్తుండగా రాజీవ్‌నగర్ వద్ద ట్రాక్టర్‌ను తప్పించే ప్రయత్నంలో సిమెంటు లారీని ఢీకొన్నారు. దీంతో కారు నుజ్జయింది. డీఎస్ బాలాజీకి తీవ్రగాయాలు కాగా వైద్యచికిత్స నిమిత్తం చెన్నైకి తరలించారు. మిగిలిన వారు స్వల్పగాయాలతో స్వస్థలాలకు చేరుకున్నారు.

ట్రాయ్ కాగ్ సభ్యుడిగా చిట్టిబాబు



పాలసముద్రం: ట్రాయ్ (టెలికామ్ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా) కాగ్ సభ్యుడిగా పాలసముద్రం మండలం కృష్ణజమ్మపురం గ్రామానికి చెందిన చిట్టిబాబును నియామకం చేసినట్లు ట్రాయ్ న్యూఢిల్లీ ప్రధాన కార్యాలయం నుంచి డిప్యూటీ అడ్వైజర్ మదన్‌మోహన్ నుంచి ఉత్తర్వులు వచ్చిందని బుధవారం చిట్టిబాబు తెలిపారు. 2015 సంవత్సరం నుంచి ఇప్పటివరకు ఆరోసారి నియామకం అయినట్లు చెప్పారు. జాతీయస్థాయిలో వినియోగదారుల సేవల నాణ్యతను సమస్యలు పరిష్కారానికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వబడుతుందని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు ట్రాయ్ కాగ్ సభ్యులుగా ఉన్నామన్నారు. నేటి ఆధునిక యుగంలో టెక్నాలజీ అభివృద్ధి చెందుతున్న తరుణంలో వినియోగదారులకు సమావేశాలు నిర్వహించి మరింతగా టెక్నాలజీ చేరువయ్యేలా కూడా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ట్రాయ్ సెక్రటరీ న్యూఢిల్లీ నుంచి కూడా అప్రిసియేషన్ సర్టిఫికెట్ కూడా తీసుకున్నామన్నారు. 2015 నుంచి కాగ్ సభ్యులుగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు.

ఉత్తమ జీవన మార్గాన్ని చాటేదే రంజాన్



రంజాన్ తోఫాను అందిస్తున్న బాలాజీ

కార్వేటినగరం: ఉత్తమ జీవన మార్గాన్ని చాటేది రంజాన్ పండుగని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ అన్నారు. బుధవారం మండల కార్యాలయ ఆవరణంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి చొరవతో, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ ఎంసీ విజయానందరెడ్డి లక్షలు వెచ్చించి అందించిన రంజాన్ తోఫాను ముస్లింలకు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ, దాతృత్వం ధార్మికం, చింతన కలయిక రంజాన్ పండుగ అని గుర్తు చేశారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి చొరవతో ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ ఎంసీ విజయానందరెడ్డి, పేద, ధనిక అనే తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరూ సమానంగా రంజాన్ వేడుకలను జరుపుకోవాలనే ఉద్దేశంతో ఒక్కో కుటుంబానికి సుమారు రూ.2,250 విలువ చేసే నిత్యావసర సరుకులను అందించడం జరిగిందన్నారు. అనంతరం మాజీ మండల కన్వీనర్ ధనుంజయవర్మ మాట్లాడుతూ యావత్ భారత దేశం మన వైపే చూసేలా సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత జగనన్నదేనన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ గోపి, సోషల్ మీడియా కన్వీనర్ రఫీ, మున్న, చందురాజు, వెంకటేష్, ధనశేఖర్ వర్మ, ధనశేఖర్ యాదవ్, వెంకటరత్నం, మండల సచివాలయ కన్వీనర్ పురంధర్, రాజా, వలంటీర్లు, ముస్లింలు పలువురు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న మహేష్

పుత్తూరు రూరల్: పుత్తూరు మండలంలోని పలు గ్రామాల్లోని ఉపాధి హామీ కూలీలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం సబ్ కమిటీ సభ్యులు మహేష్ కోరారు. బుధవారం పరమేశ్వరమంగళం పంచాయతీలోని కైలాసపురం, కూర్మానుకండ్రిగ గ్రామాల్లో పనిచేస్తున్న ఉపాధి కూలీలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ పథకం అమలులో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఈ ఏడాది బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకం అమలుకు అరకొర నిధులు కేటాయించడమే ఇందుకు నిదర్శనమన్నారు. గ్రామాలకు సుదూర ప్రాంతాల్లో పని కల్పించడం వల్ల వ్యయ ప్రయాసాలతో కూలీలు సదరు ప్రదేశాలకు చేరుకోవల్సి వస్తోందన్నారు. ప్రతి ఒక్కరికీ 200 రోజుల పని దినాలు కల్పించాలని, రోజుకు రూ.600 కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు గోపి, సురేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.